క్లుప్తంగా

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): కొత్త ఆశలు, ఆకాంక్షలతో 2023వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న నగర ప్రజలందరికీ ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఓ ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాల్లో నూతన వెలుగులను నింపాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు తీసుకొచ్చే ఏడాది కావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం మరింత సర్వతోముఖాభివృద్ధి సాధించాలని ప్రార్థించారు.

ముక్కోటికి ఆలయాలు సంసిద్ధం



చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: 2023 జనవరి రెండో తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా నగరంలోని పలు ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండంలో కొలువైఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు క్యూలు ఏర్పాటు చేశారు. అంతరాలయ పూజలు అనంతరం ఉదయం ఐదు గంటలకు దర్శనం ప్రారంభమవుతుందని టీటీడీ అధికారులు వెంకటయ్య, రామచంద్రరావు తెలిపారు. భక్తులు కోవిడ్ నిబంధనలు కారణంగా మాస్క్ ధరించి రావాలని సూచించారు.

వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో..

లబ్బీపేట వెంటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం ద్వారా వెంకటేశ్వరుని దర్శించుకోవాలని కోరారు. పైడియ్య వీధిలోని ఎంట్రెన్స్ ద్వారానే రావాలని సూచించారు. దేవాలయ ట్రస్టీబోర్డ్ చైర్మన్ మాగంటి సుబ్రహ్మమణ్యం, మేనేజర్ శర్మ భక్తులకు ఏమాత్రం అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ప్రజలపై సాయినాథుని ఆశీస్సులు ఉండాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నూతన సంవత్సరంలో షిర్డీ సాయినాథుని ఆశీస్సులు ప్రజలపై ఉండాలని, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధికి సాయిబాబా కటాక్షం ఎల్లవేళలా ఉండాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీషిర్డి నాగసాయిబాబా–నాగమానసాదేవి మందిరంలో శ్రీసాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ (షిర్డీ) క్యాలెండర్‌ను శనివారం మల్లాది విష్ణు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతి ఏడాది వేలాదిగా సాయిబాబా సంస్థాన్ క్యాలెండర్లను భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామిని అభినందించారు. నూతన సంవత్సరంలో ప్రజలంతా సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రస్తావిస్తూ ఇన్ని పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనన్నారు. పేదల కోసం కృషి చేస్తున్న తమ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలన్నారు. మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా మందిరంలో శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ (షిర్డీ) క్యాలెండర్లు భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనేక సంవత్సరాలు క్యాలెండర్ ఆవిష్కరణ సూపర్ స్టార్ కృష్ణ, విజయనిర్మల చేతుల మీదుగా నిర్వహించేవారమన్నారు. ఈ ఏడాది 10 వేల క్యాలెండర్లను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 23వ డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు (సురేష్), గవర్నమెంట్ ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు యర్రంశెట్టి అంజిబాబు, కె. విజయ్ పాల్గొన్నారు.

రూ.3.80 కోట్లతో అభివృద్ధి పనులు

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులకు సదుపాయాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంలో పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్లో రూ. 3.80 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తోందని, ఏపీ ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. హైస్కూల్లో వైఎస్సార్ సీపీ నాయకులు బోరా బుజ్జి విద్యార్థులు సమావేశాలు జరిగేటప్పుడు కూర్చునేందుకు ప్లాస్టిక్ పట్టాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ విద్యార్థులకు సదుపాయాలను కల్పించడంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. హైస్కూల్లో పని చేస్తున్న అటెండర్ విజయమ్మ అనారోగ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నందున ఆపరేషన్ కోసం వైఎస్సార్ సీపీ నాయకులు అలంపూరు విజయ్, బోరాబుజ్జి రూ.10వేలను ఎమ్మెల్యే ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వీరబాబు, రామిరెడ్డి, యోహాను, రమేష్, హైమావతి, వీరంకి నాగేశ్వరావు, హెచ్ ఎం మోహన్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి



మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ శర్వాణిమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మహిళలు ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే వారి కుటుంబాలతో పాటు సమాజం కూడి అభివృద్ధి సాధిస్తుందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణిమూర్తి ఆధ్వర్యంలో సత్యనారాయణపురం గిరివీధిలో శనివారం పేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల స్ఫూర్తిగా కార్పొరేటర్ శర్వాణిమూర్తి డివిజన్‌లో ఉపాధి లేని మహిళలకు చేయూత అందించడం అభినందనీయమన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో సత్యనారాయణపురంపై ప్రత్యేక దృష్టిపెట్టామని, ఆ మేరకు పలు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో అన్ని మౌలిక సదుపాయాలతో ఈ ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్పొరేటర్ శర్వాణిమూర్తి మాట్లాడుతూ డివిజన్ పర్యటనలో భాగంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న 52 మంది పేద మహిళలను గుర్తించామని, వారిలో మొదటి విడతగా 12 మంది మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇప్పించి అనంతరం కుట్టు మిషన్లను అందజేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఉపాధి అవకాశాలు లేని 42 మంది పురుషులకు కూడా వివిధ సంస్థలలో ఉద్యోగాలు ఇప్పించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమలో వైఎస్సార్ సీపీ డివిజన్ కో–ఆర్డినేటర్ దోనేపూడి శ్రీనివాసరావు, కోలవెన్ను వెంకటరమణ, సనాత్, చాంద్‌శర్మ, మారుతి, చామర్తి మూర్తి, కొమ్మిలి రత్నాకుమార్, రంగబాబు, రాజశేఖర్, నాదేండ్ల శంకర్ పాల్గొన్నారు.

అర్జునరావు జీవిత విశేషాలను పాఠ్యాంశంగా చేర్చాలి



అర్జునరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ, సంస్కరణ ఉద్యమంలో మహాత్మా గాంధీ తర్వాతి స్థానం సంపాదించిన రావూరి అర్జునరావు, మనోరమ దంపతుల జీవిత విశేషాలను రేపటి తరం కోసం పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని పలువురు వక్తలు సూచించారు. ఇటీవల మరణించిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు నాస్తికులు, సంఘసంస్కర్త రావూరి అర్జునరావు సంస్మరణ సభ సర్వోదయ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక సమర యోధుల భవనంలో జరిగింది. ఈ సభలో జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు పాల్గొని అర్జునరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాలు, ఆశయాలకు కట్టుబడి ఉన్నారని, గోరా కుటుంబం కేవలం మాటలకే పరిమితం కాకుండా జీవితంలో ఆచరించి అందరికీ స్ఫూర్తిగా నిలిచారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ తొలి రోజుల్లో జరిగిన కులాంతర, మతాంతర వివాహం అర్జునరావు మనోరమ దంపతులదేనన్నారు. సర్వోదయ ట్రస్టు అధ్యక్షుడు జీవీ మోహన్ ప్రసాద్ అధ్యక్షత వహించగా కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు, సాధిక్ మాట్లాడుతూ అర్జునరావు జీవిత విశేషాలను పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు జయకర్, సర్వోదయ ట్రస్ట్ ప్రతినిధులు నారాయణ ప్రసాద్, కొత్త విజయ్ కుమార్, నియంత, చూనావ్, అరుణకుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. స్థానిక మారుతీనగర్‌లోని సుదర్శన్ మాస్టర్స్ అకాడమీలో శనివారం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. డా.బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వెలగా జోషి, శారదా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీధర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శర్మ, కేబీఎన్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.నారాయణరావు, సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీన్ ప్రొఫెసర్ డా. పాండురంగారావు, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ మనవడు సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన సంవత్సర సందడి

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్ దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదోలైన్‌లో శనివారం రాత్రి రెసిడెన్సియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. నృత్యాలు చేస్తూ నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమాలను మధు, ప్రసాద్, రాజేష్ పర్యవేక్షించారు.

అయ్యప్ప శరణం.. సకల పాప హరణం

భవానీపురం(విజయవాడపశ్చిమ): అయ్యప్ప స్వామిని శరణు వేడితే సకల పాపాలు తొలగిపోతాయని, సుఖమయ జీవితం ప్రాప్తిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వేముల హజరతయ్య గుప్తా పేర్కొన్నారు. గొల్లపూడిలోని అయ్యప్ప స్వామి ఆలయ కల్యాణమండపంలో ఆయన డాక్టర్ ఏడుకొండల రావు, ఎన్ నవీన్‌తో కలిసి అయ్యప్పలకు శనివారం అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఏపీ ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని స్వాములకు అన్నం వడ్డించారు. సమితి కార్యదర్శి శ్రీనివాస్, సుందరరావు, దిలీప్ కుమార్, మురళీకృష్ణ, రమేష్, చలమయ్య పాల్గొన్నారు.

రేపు ఉత్తర ద్వార దర్శనం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని పేర్కొన్నారు.

పోలీస్ పికెట్‌ల ఏర్పాటు

ఆటోనగర్(విజయవాడతూర్పు): నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలు ప్రశాంతంగా జరుపుకునేందుకు విజయవాడ సెంట్రల్ జోన్ పరిధిలో 31 పోలీస్ పికెట్‌లను ఏర్పాటు చేసినట్టు సెంట్రల్ ఏసీపీ ఖాదర్‌బాషా చెప్పారు. ప్రతిఒక్కరూ నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. విజయవాడ సెంట్రల్ జోన్‌లో శనివారం ఆయన మాట్లాడారు.

నరేష్‌పై ఫిర్యాదు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హిందూ దేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసి అయ్యప్ప మాలాధారులు, హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహించిన బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని అఖిలభారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ ఉపాధ్యక్షుడు లంకా బాబు శనివారం సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అఖిలభారత ధర్మ ప్రచారసభ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, రాష్ట్రీయ పరశురామ సేన అధ్యక్షుడు సుధాకర్ సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ ఎస్సై దుర్గామహేష్‌కు ఫిర్యాదును అందజేశారు.

యువతిని తిట్టిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువతికి ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడిన వ్యక్తిపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఊర్మిళా నగర్‌కు చెందిన యువతి ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. ఆ యువతి ఏడో తరగతి చదివే రోజుల్లో సీనియర్ గురుప్రసాద్ తనను ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. అంగీకరించని యువతి తల్లిదండ్రులకు చెప్పింది. అప్పట్లో వారు గురుప్రసాద్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఆర్నెల్ల క్రితం యువతి స్నేహితురాలి ద్వారా మాట్లాడడం ప్రారంభించాడు. పరస్పరం ప్రేమించుకోవడం జరిగింది. కొద్దిరోజుల క్రితం గురుప్రసాద్ యువతి ఇంటికి వెళ్లి మీ అమ్మాయి, నేను ప్రేమించుకుంటున్నామని, పెళ్లి చేసుకుంటానని ఆమె తల్లిదండ్రులకు చెప్పాడు. వారు అంగీకరించారు. ఈ క్రమంలో గురుప్రసాద్ యువతికి ఫోన్ చేసి శారీరకంగా కలుద్దామని అడిగాడు. ఆమె నిరాకరించింది. దీంతో అతను యువతిని ఫోన్‌లో అసభ్యకరంగా తిట్టాడు. దీనిపై బాధితురాలు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురుప్రసాద్‌పై కేసు నమోదు చేశారు.

ప్రతి పేదవాడికి న్యాయం చేయడమే ధ్యేయం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా



కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, కార్పొరేటర్ షాహీనా సుల్తానా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రతి పేదవాడికి న్యాయం చేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. 59వ డివిజన్‌లో పరిధిలోని 235 వార్డ్ సచివాలయ పరిధిలో నూతనంగా మంజూరైన రేషన్‌కార్డులను కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా కార్యాలయంలో శనివారం పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాల పంపిణీ అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రజలెవరూ ప్రతిపక్షాలను నమ్మే పరిస్థితుల్లో లేరని, ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదజల్లాలని చూస్తే ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కోటి రుద్రాక్ష అభిషేక అర్చనకు రూ.54 వేల విరాళం



డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి విరాళం అందజేస్తున్న చెట్లపల్లి మారుతీప్రసన్న

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిరిడీ ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో మార్చి 28న నిర్వహించనున్న కోటి రుద్రాక్ష అర్చనకు శనివారం మారుతీ గ్యాస్ ఏజెన్సీస్ అధినేత చెట్లపల్లి మారుతీప్రసన్న రూ.54వేలు విరాళాన్ని మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా గౌతంరెడ్డి మాట్లాడుతూ లోక కళ్యాణార్థం మార్చిన 28న ఆలయకమిటీ ఆధ్వర్యంలో కోటి రుద్రాక్ష అభిషేక అర్చన నిర్వహించ తలపెట్టామన్నారు. కోటి రుద్రాక్ష అభిషేక అర్చనలతో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలనే సదుద్దేశంతో భక్తుల నుంచి రుద్రాక్షలకు విరాళాలు సేకరిస్తున్నామన్నారు. మందిరంలో ఏ కార్యక్రమం తలపెట్టినా భక్తులు, దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు మరువలేనివన్నారు. దాత మారుతీగ్యాస్ ఏజన్సీస్ అధినేత చెట్లపల్లి ప్రసన్న మాట్లాడుతూ కోటి రుద్రాక్ష అర్చనలో తాను కూడా భాగస్వామి కావాలనే ఉద్దేశంతో 108 మాలలకుగానూ రూ.54వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించి, దాతకు బాబావారి చిత్రపటం శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాదికారి మందలపర్తి సత్యశ్రీహరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తిరుమల నిత్యాన్నదానానికి కూరగాయలు వితరణ



కూరగాయల లారీని జెండా ఊపి ప్రారంభిస్తున్న లక్ష్మణస్వామి, వీరవెంకయ్య

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ముక్కోటి ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారి నిత్యాన్నదానంలో కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ సంఘం భాగస్వాములు కావడం తమ పూర్వ జన్మ సుకృతమని అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మల లక్ష్మణస్వామి అన్నారు. బెంజిసర్కిల్ సమీపంలోని లారీ యజమానుల సంఘం కార్యాలయం నుంచి సామాజికవేత్త మండవ కుటుంబరావు ఆధ్వర్యంలో తిరుమలకు 10 టన్నుల కూరగాయలను శనివారం పంపించారు. కూరగాయల లారీని సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మల లక్ష్మణస్వామి, కార్యదర్శి గోపిశెట్టి వీర వెంకయ్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా తిరుమలకు ముక్కోటి ఏకాదశి రోజుల తమ సంఘం ఆధ్వర్యంలో కూరగాయల పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు మద్ది వెంకటకృష్ణారెడ్డి, కోనేరు నాగేశ్వరరావు, కార్యదర్శులు ఆళ్ల వెంకటేశ్వరరావు, వత్సవాయి కృష్ణంరాజు, కోశాధికారి పాలడుగు నగేష్, సంఘ కోఆపరేటివ్ స్టోర్స్ ఉపాధ్యక్షులు కోడే సాంబశివరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



కేక్‌ను కట్ చేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివారావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాతో కలిసి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి న్యూ ఇయర్ కేక్‌ను శనివారం కట్ చేశారు. కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, వైఎస్సార్‌అభిమానులకు స్వీట్లు పంచి కేక్ తినిపించారు. నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
కంచికచర్ల
C/o. SRR & CVR Govt. Degree College [illegible]

టెండరు నోటీసు

[illegible] 2022-23, 2023-24 [illegible]

1. [illegible]: 09.01.2023 [illegible]
2. [illegible] : 10.01.2023 [illegible]
3. [illegible]

[illegible] రూ. 350/- [illegible] 94402 76232 [illegible]

ప్రిన్సిపాల్, SWR GDC for Girls, KANCHIKACHERLA